# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగించడమే ప్రభుత్వం ధ్యేయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**
2. **తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ రోజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.**
3. **తెలుగు రాష్ట్రాలనుంచి కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేసిన పలువురు మంత్రులు ఈరోజు అధికారికంగా పదవీ బాధ్యతలను చేపట్టారు.**
4. **గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో రద్దు చేసిన పలు రైళ్లను పునరుద్దరించినట్లు సీనియర్ డిసిఎం ప్రదీప్ కుమార్ తెలిపారు.**
5. **ఈనెల 26వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా మత్తు-రహిత భారత పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మాదక ద్రవ్యాల నియంత్రణ కేంద్రం తెలిపింది.**

==========================

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ ఉదయం చంద్రబాబునాయుడుతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు మహాద్వారం వద్ద టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ముఖ్యమంత్రికి రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టిటిడి అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఘన విజయం సాధించామని చెప్పారు. ప్రపంచంలో తెలుగుజాతి అత్యున్నత స్థాయిలో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నో ఎన్నికలు చూశామని.. ఈసారి ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగించడమే ప్రభుత్వం ధ్యేయమని చెప్పారు.

--------------------------

తెలుగు రాష్ట్రాల నుంచి కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన పలువురు మంత్రులు ఈరోజు అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యులు జి.కిషన్ రెడ్డి ఈరోజు ఢిల్లీలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కె. రామ్మోహన్ నాయుడు పౌర విమానాయాన శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

మరోవైపు.. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధరేంద్ర ప్రదాన్ కూడా ఈరోజు బాధ్యతలు చేపట్టారు.

---------------------------

ముఖ్యమంత్రి, మంత్రుల నియామకానికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ నిన్న విడివిడిగా నోటిఫికేషన్లు జారీ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రిమండలి సభ్యుడిగా నారా చంద్రబాబు నాయుడు నియామకంతోపాటు 24 మంత్రుల నియామకం సైతం నిన్న మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి ఎం. రవిచంద్రను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో రద్దు చేసిన పలు రైళ్లను పునరుద్ధరించినట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ వెల్లడించారు. విజయవాడ – రేపల్లె, గుంటూరు – రేపల్లె, రేపల్లె–తెనాలి రైళ్లను ఈ నెల 21 నుంచి ఆగస్టు ఎనిమిదో తేదీ వరకు పునరుద్ధరించినట్టు వివరించారు. అలాగే విజయవాడ– మాచర్ల రైలును ఈ నెల 22వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు, తెనాలి –రేపల్లె, రేపల్లె –గుంటూరు, గుంటూరు –తెనాలి రైళ్లను ఈ నెల 23 నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు పునరుద్ధరించనున్నట్టు పేర్కొన్నారు. మార్కాపురం–రేపల్లె, తెనాలి –గుంటూరు, గుంటూరు – విజయవాడ రైళ్లను ఈ నెల 24 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

---------------------------

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈనెల 12 నుంచి 26వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా మత్తు–రహిత భారత పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మాదక ద్రవ్య నియంత్రణ కేంద్రం ఎన్‌సిబి తెలిపింది. ఈ పక్షోత్సవాలలో భాగంగా మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొంది.

---------------------------

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల కల్పనకు రేపు ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని జిల్లా ఉపాధి కార్యాలయం ఆవరణలో ఈ జాబ్ మేళా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో 11 ప్రైవేటు సంస్థలు పాల్గొంటున్నాయని వివరించారు. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్లలోపు వారు ఉద్యోగ మేళాలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. అర్హతలు ఉన్న వారు తమ బయోడేటాతో పాటుగా విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డుతో రేపు ఉదయం పది గంటల నుంచి జరిగే ఉద్యోగ మేళాకు హాజరు కావాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి అనూహ్యమైన విజయాన్ని సాధించిందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశం నిన్న జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 164 స్థానాల్లో కూటమి గెలుపొందిందన్నారు. బీజేపీ తరపున

సమన్వయ కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. కూటమి సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

---------------------------

ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అవసరాలు, సవాళ్లను దృష్టిలో పెట్టుకుని ప్రజారంజక పాలన అందించాలని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. ఈ మేరకు చంద్రబాబునాయుడుకు ఆమె లేఖ రాశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకంతో ప్రజలు అధికారంలోకి తీసుకొచ్చారని తెలిపారు. అనుభవం, నిష్పాక్షికతో వ్యవహరిస్తూ పరిస్థితులను చక్కదిద్దుతారని ఆశిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రగతి కోసం కాంగ్రెస్ నిర్మాణాత్మకమైన పాత్ర పోషిస్తుందని ఆ లేఖలో పేర్కొన్నారు.

---------------------------

ఆధార్ కార్డుతో - రేషన్ కార్డ్‌ను అనుసంధానం చేసేందుకు సంబంధించిన గడువును పొడిగిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. జూన్ 30వ తేదీతో గడువు ముగియనుండగా ఈ గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పెంచినట్లు తెలిపింది. ఆధార్- రేషన్ కార్డు అనుసంధానం వల్ల అర్హులైన వారందరికీ ఆహార ధాన్యాలు అందడంతో పాటు నకిలీ రేషన్ కార్డులు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఇప్పటికీ ఆధార్- రేషన్ కార్డ్ అనుసంధానం చేయని వారు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించింది. దీని కోసం సమీపంలోని రేషన్ దుకాణం లేదా కామన్ సేవా కేంద్రాల సాయంతో ఆధార్- రేషన్ కార్డు అనుసంధానం చేయించుకోవచ్చని తెలిపింది.

---------------------------

రాష్ట్రంలోని న్యాయవాదులకు మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ది బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సభ్యులు వి. బ్రహ్మారెడ్డి తెలిపారు. గుంటూరులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్‌యూ ఆడిటోరియంలో రేపటి నుంచి 16 వ తేదీ వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఆ శిక్షణ తరగతులకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, తదితరులు హాజరవుతారని చెప్పారు. 16న జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా హాజరై ప్రసంగిస్తారని వివరించారు.

---------------------------

అనంతపురం జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణంపై విస్తృత ప్రచారం చేపట్టాలని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. నిన్న కలెక్టర్ కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో నిర్వహించిన సమీక్షాసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్టీసీ పురోగతికి గతంలో కంటే రెట్టింపు స్థాయిలో ఆదాయం వచ్చేలా సర్వీసుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అనంతపురం నగరం నుంచి హైదరాబాద్, బెంగళూరు వంటి మహా నగరాలకు ఓల్వో బస్సులు నడిపేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కండక్టర్లు, డ్రైవర్లకు నైపుణ్యంపై మరింత తర్ఫీదు అవసరమని పేర్కొన్నారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో నిర్ణీత కాల గడువుతో ఒప్పంద ఉపాధ్యాయులుగా నియమితులైన 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు పాఠశాల విద్యా శాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. వీరి సేవలను వచ్చే ఏడాది ఏప్రిల్

30 వరకు పునరుద్ధరిస్తూ ఈ నెల 10న ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, వీరిని కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలల్లో నియమించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లోను, 98 కంటే తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న పాఠశాలల్లోనూ ఒకరు చొప్పున ఒప్పంద ఉపాధ్యాయులని నియమించాలని పేర్కొన్నారు. పాఠశాల అవసరాన్ని బట్టి వీరిని నియమించడంతో పాటు ఏ పాఠశాలకు ఒక్కరి కంటే ఎక్కువ మంది నియమించరాదని ఆదేశించారు.

---------------------------

నైరుతి రుతుపవనాలు రానున్న 3-4 రోజుల్లో కోస్తాంధ్రా, ఒడిశా, వాయువ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలో ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలియజేసింది. రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు ఒకటి రెండు చోట్ల వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

---------------------------

జులై 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్న మూడు నూతన నేర న్యాయ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినీయం చట్టాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అనంతపురం జిల్లాకి చెందిన న్యాయ శాస్త్ర విద్యార్థిని మహిమ ఆకాశవాణితో మాట్లాడుతూ ఈ చట్టాల అమలు ద్వారా నేరస్తులకు సరైన సమయంలో శిక్ష పడుతుందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ కాలం నాటి చట్టాలలో నేరస్తులు శిక్ష నుండి తప్పించుకునే అవకాశం ఉండేదని, నూతన చట్టాల్లో అటువంటి అవకాశంలేదని అన్నారు. ఈ చట్టాలు మహిళల భద్రతకు ఎంతో ఉపయోగం చేకూరుస్తాయని తెలిపారు.

======================